



# సంచలనం

డాక్టర్ ఎ.వి. రమణ ప్రసాద్

చెన్నప్ప మాదిగోళ్ళ బాయికాడ నీళ్ళు చేదుతావుంటే చెర్లో దోసకాయిలు పీకుతావుండే, రాముడు చెన్నప్పను చూసి "ఏరా! సాల్మన్‌గా డొచ్చినాడు కనపణ్యా' అనె. "సల్లప్పగాడా! ఎబ్బుడొచ్చినాడు. యాడుండాడు" అని ఇగిలించుకుంటూ ఆత్రంగా అడిగె చెన్నప్ప. రాముడు చెప్తతాన్నంగనే "ఎన్నాళ్ళయి పోయనో సల్లప్పగాణ్ణి చూసి' అని అనుకోని నీళ్ళ కడవ బిరిగ్గన చేదేసి, భుజానికెత్తుకోని పోదామని చెన్నప్ప అనుకుంటా వుంటే, కడవలో నుంచీ నీళ్ళు కారబట్టె. మొన్న బాయిలోకి తాడుగట్టి కడవ ఇడిసినబ్బుడు మోటు తగిలి కడవకు బొక్క పడింటే దానికి గుడ్డపేలిక ఎక్కిచ్చిండె చెన్నప్ప. బొక్కదోంత పెద్దదై గుడ్డ పేలిక సాలకచ్చి మల్లా నీళ్ళు కారతావుంటే బాయిసుట్టూతా పడిండే పాత గుడ్డలేరకచ్చి పేలికలు బొక్కలోకి బిర్రుగ ఎక్కిచ్చి కడవబాయిలోకిడిసి నీళ్ళుసేది కడవ ఎత్తుకోని బిరిబిరీ మాదిగ్గేరికి నడసబట్టె చెన్నప్ప.

సల్లప్ప అనంతపురంబోయి మతంలో చేరి సాల్మన్ అని పేరు మార్చుకుండాడని చెన్నప్పకు తెల్చు. పిల్లబ్బుదు చెన్నప్పా, సల్లప్పా ఇద్దరూ ఒగిటో తరగతి కాట్నుంచీ ఐదో తరగతి వరకూ సదివినారు. సల్లప్ప ఐదు సదివినంక హైస్కూలుకు అనంతపురం బాయ. చెన్నప్పేమో

# మయసభ



పరేడ్ జరుగుతుంది
నిశ్శబ్దంగానే
హుకుం జారీ అవుతుంది
మనిషి మౌన స్మశానం
అడవుల్లో ఒంటరిగా మిగిలిన
కాలిబాట నిశ్శబ్దం
లోయల అంచుల మీద భయంగా వొంగిన
చెట్టుకొమ్మల నిశ్శబ్దం
పన్నెండు గంటల రాత్రి
కునుకు రాదు
కల చెదిరిపోయిన
కనురెప్పల నిశ్శబ్దం
మనసులోకి తొంగి చూస్తే
రోడ్డు మీదెవ్వరూ కనబడరు
దుమ్ము రేగి
ధూళి రేగి
కొమ్మలిరిగి చెట్లు కూలి
నేలంతా కల్లోల సముద్రం
గోడల మీదన్నీ గీరుకుపోయిన గాయాలు
కరంటు స్తంభానికి రక్తం మరకలు
వీధి బోరు దగ్గర చెల్లా చెదురైన బకెట్లూ
అక్కడో ఘర్షణ జరిగింది
ఆ చితుల్లేని స్మశానంలో
నిశ్శబ్దమొక్కటే మిగిలింది
మాట వినిపించదు
దుఃఖం వినిపించదు
పడవ మునిగి చెక్కలు తేలిన నిశ్శబ్దం
కళ్లు నిశ్శబ్దమే
చెవులూ నిశ్శబ్దమే
గొంతు పెగలని రాజ్యంలో
చలనం నిశ్శబ్దమే
నిషేధానికి సాక్షిగా
ఎవరి అస్థి పంజరాన్నో
ఆ చెట్టుకి తగిలించారు
శవయాత్రలా
చుక్కలతో, చంద్రునితో
రాత్రి సాగిపోతుంది నిశ్శబ్దంగా
పోలీసు ఠాణాలు
రక్తం మడుగులో తేలుతున్నాయి
అంతా ఒక పద్ధతి ప్రకారమే జరుగుతుంది
చిట్లిన మోకాలి మీద
లాఠీని గుచ్చి చిత్రవధ చేస్తున్నారు
అంతా లెక్కప్రకారమే జరుగుతుంది
నిషేధం వాడికి ఆయుధమే కాదు
నిశ్శబ్దాన్ని ఏలుకోవటానికి కిరీటం కూడా
అంతా సవ్యంగా వున్నట్లే కనిపిస్తుంది
ముఖమ్మీద నవ్వు కనబడుతుంది
కాళ్ళ కింద భూమి వుంటుంది
అయినా నిలుచున్న చోటే కుంగిపోతుంటాం
నాలుకను చీల్చి
లోపలికి ముడివేసిన నిశ్శబ్దం
ఉన్నది లేనట్టుగా
లేనిది ఉన్నట్టుగా ఈ రాజ్యం ఓ మయసభగా
తలను తీసేసి
వీపుకి ఓ కన్ను అతికించి
చేతిలో తుపాకి పెడితే
అది ప్రభుత్వం
కుట్ర జరుగుతుంది
మోసం జరుగుతుంది
కుటుంబ సపరివారమ్మీద
రాజ్యహింస జరుగుతుంది
లాఠీ నిఘా వుంటుంది
ఇక్కడే నువ్వూ నేనూ
నిర్ణయం తీసుకోవాల్సి వుంది
దేశాన్ని పోలీసు ఠాణాలోనే వుంచాలా
ఖడ్గానితో తాళాల్నీ, గొళ్లాల్నీ, తెగనరకాలా!
ఇక్కడే మనం
గట్టిగా నిలబడే అవసరముంది

—ఆశారాజు

రెడ్డోరింట్లో జీతానికి కుదురుకుండె.

నాలుగో తరగతి సదివేటబ్బుడే చెన్నప్పగాని అయ్య చంద్రాయుడు ఒకనాపొద్దు సారాయి ఫుల్లుగా తాగి నెట్టు లేకుండా పోతావుంటే ఎద్దు పొడిచి చచ్చిపాయ. ఒగసంవత్సరం అట్లా ఇట్లా వుండి చెన్నప్పగాని అమ్మ తమ్మాపురం ముత్తప్పతో లేచిపాయ. మాదిగ్గేరికీ, రంగానాయికులు గుడికీ నడిమద్దెన వుండే వాళ్ళ సొంత కొట్టంలోనే చెన్నప్ప పాపం ఏడ్చుకుండా పడుంటే సుట్టుపక్కల వుండేవాళ్ళు, వాళ్ళురోన్నాళ్ళు వీళ్ళు రోన్నాళ్ళు చెన్నప్పకు బువ్వబెట్రి. ఆనంక చెన్నప్ప బడి ఇడిసి పెట్టి పెద్దిరెడ్డింట్లోకి చేరిపాయ. కొట్టంలో వుండే బిందీ, బోకులూ అన్నీ దీసకచ్చి చెన్నప్ప నారాయణమ్మ అంచవ బెట్టె. కొట్టానికి బీగమేసి బీగం చెవులు మలతాడుకు కట్టుకుండె.

చెన్నప్ప పెద్దోడు గాబట్టె. పెద్దిరెడ్డోళ్ళ జీతగాడైపాయ.

చెన్నప్ప సాల్మన్‌గాణ్ణి చూచి శాన్నాళ్ళాయ. వాడు ఈవూరు ఇడిసిపెట్టి సుమారుగ పదేండ్లు అయింటాది. సల్లప్పగూడా చెన్నప్ప ఈడోడే. మంచి నీళ్ళు కడవ రంగనాయికులు గుడి కాడ దింపేసి చెన్నప్ప సల్లప్పకోసం ఊరంతా తిరిగబట్టె. సల్లప్ప కనపడితే చెన్నప్పకు సంబరమైపాయ. ఇద్దరూ గుట్టకాటికిపోయి పెదిం చేవు మాట్లాడుకుండ్రి. అదేందో సర్టిపికేటు కావాల్సింటే సర్కారు బడి అయ్యవారుతో ఇప్పిచ్చుకునేకి వచ్చినాడండ. సల్లప్పనాడిబ్బుడు అనంతపురంలో బియ్యే సదువుతావుండాడంట. బాపనోళ్ళ పిల్లోడు ఎంకటేశమప్పసామి కొడుకు క్రిష్ణ శాస్త్రుల్లు, సల్లప్పా ఇద్దరూ ఒగే క్లాసంట.

# పత్తిపూవు

ఊరందరికీ మా అయ్య బానిసైతే
పాపం అమ్మ; అయ్యక్కూడా బానిస...
బానిసకే బానిసైన
అమ్మ బతుకులోకి పారజూస్తే
లెక్కలేని వాయుగుండాలు
దిక్కులతో పోటీపడుతుంటాయ్...

మాసిపోయిన వరదగుడిలాంటి
అమ్మను చూసినపుడల్లా
గొంతు చిట్లిపోయి, పెన్ను నెత్తురు కక్కుతుంది
అక్షరాలు మోయలేని ఏడుపుకొండ
కనుల కొమ్మలకు వేలాడుతుంది...

ఆడతనం అంటరానితనాల నడుమ అమ్మ
రోకలి బండ కింద చితికిన
దొసబద్దై రోదిస్తుంది...
ఆకలి మంటల్లో మండుతున్న
అమ్మ గుండె పుండు మీద
మొగోళ్ళ పోరంబోకుతనం
గొడ్డుగారమై వాలుకుతుంది...

* * *

పడమటి మంచంలో నిద్రబోతున్న
సూరిగాడిపై చెంబుడు కళ్ళాపి చల్లి
మా పూరి గుడిసె ముందు అమ్మ
పొద్దుటెండను పారబోస్తుంది
ఎంగిలి తపాళ్ళను తళుకుటద్దాలు చేసి
మురికి గుడ్డలపై కొండమల్లెలు పూయించి...
నిప్పుల కుంపటిలో మసిబొగ్గై మండి
అస్తమానం అమ్మ
'బియపు మర'లా ఆడుతుంటుంది...

'మరెడ్డోరింటి కాడ ఇన్ని అటుకులు బెట్టిచ్చ కస్తా తింటావారా? ఈడేవుండు. బిర్గిగన పోయి నారాయణమ్మ అమ్మయ్యతో అటుకులు పెట్టి చ్చకస్తా' అని చెన్నప్ప అడిగితే సల్లప్ప "ఒద్దులేరా' అనె. వాడు ఇబ్బుడే బాపనోళ్ళింట్లో ఫలారం చేసొచ్చి నాడంట. సల్లప్ప చెప్తతావుంటే చెన్నప్పకు ఇసిత్రమైపాయ. కుశాల కంటాడేమో అనుకోని 'నా సొచ్చిగా! బాపనోళ్ళింటి కాడ ఫలారం తింటావా? ఆల్లింట్లోకి పోతివా? ఆల్ల గలాసుల్లో నీళ్ళుగూడా తిగితివా? అని జాము జాముకూ ఇసిత్రంగా అడగబట్టె చెన్నప్ప.

"లే! చెన్నుగా! మా రమాదేవికి ఏడో నెలంట. తాడిపత్రోళ్ళు జాబు రాసినారు. పాపను మనింటికి తోలకచ్చేదానికి దినము యాపొద్దు బాగుందో బాపనోల్లింటి కాటికి పోయి ఎంకటేశమప్ప సామిని అడిగిరారా! ఇదిగో ఎద్దె నా కొడకా! సొగిలిమిందేసుకోని సాములోల్లింట్లోకి గబ్బుక్కన దూరేవు. లోగిట్లోనే శానాదూరంగా నిలబడి గెట్టిగ అడుగు" అని పెద్దిరెడ్డి పెండ్లాము నారాయణమ్మ ఎచ్చరించింది. గుర్తుకొచ్చ చెన్నప్పకు.

నీళ్ళు తాగేముంత పగిలిపోయింటే రోన్నాళ్ళు బువ్వదిన్నెంక నారాయణమ్మ చెంబుపైకెత్తి మంచినీళ్ళు చెన్నప్ప దోసిట్లోకి పైన్నుంచీ పోస్తా వుంటే దోసిలి నోటికి కరుసుకోని నీళ్ళు తాగుతా తాగుతా కడుపు నిండుతాన్నంగనే చెన్నప్ప తలకాయి అడ్డంగా గంగిరెద్దు ఆడించినట్లు ఆడిస్తే నారాయణమ్మ చెంబుతో నీళ్ళు పోసేది నిలిపేస్తుంది. యాపొద్దేగాని రెడ్డోళ్ళ గలాసుల్లో చెన్నప్ప నీళ్ళు తాగలే. – అదంతా మనసు కొచ్చె చెన్నప్పకు.

చెరువుకట్ట కింద శీనప్పసామి చింత చెట్లు కొట్టిచ్చిన్నా పొద్దు కూడా అంతే. 'ఏంవోయ్! నీకు కాపీ బోయల్లంటే మాకు పెద్ద పీకులాటేనే. గలాసు తెచ్చుకునే దానికేంవోయ్ నీకు!" అని శీనప్పసామి గదురుకుంటా వుంటే ఆడబడిండే టెంకాయి చిప్ప దులుపుకోని దాంట్లో కాపీ బోయిచ్చుకోని తాగిండేది – ఈ పొద్దు మళ్ళా కండ్లకు కనపడె చెన్నప్పకు.

ఈ పొద్దేమో సల్లప్పగాడు ఊర్లో నడుస్తాపోతా వుంటే దావలో శానామంది సల్లప్పగాణ్ణి గౌరువంగా మాట్లాడిస్తాండారు. కరణాలు, కోమిటోళ్ళు, రెడ్లు, కమ్మోళ్ళు, అందరూ పొల్మన్గాణ్ణి అళ్ళిండ్లకాడ కుర్చీల్లో కూకోమన్రి.

"యాపొద్దిటికైనా ఈడు గవర్నమెంటు ఉద్యోగం జేసేది ఖాయం. ఆ పొద్దుటికైనా మనకీయప్పతోపనిబడదా! అందులోను మానూరోడు. ఈ పొద్దు నుంచే రొంత ఇదిగా చూస్తే మేలు" అని ఎవరికి వాళ్ళే అనుకునే ఆశపోతుగాళ్ళు

ఈ నా కొడుకును ఇంట్లోకి రానీకపోతే సర్కారోళ్ళతో చెపినా చెప్తతాడు. లేనిపోనిదంతా కూసి కేసుల్లో అయినా ఇరికించే నా కొడుకే" – అని లోలోపల్నే అనుకునే వాళ్ళు. అందరూ పొల్మన్గాణ్ణి గౌరవిస్తా వుంటే "రా! అప్పా! రా!" అని "రా! పా! లోపలికిరా" అనీ, ఇకిలించుకుంటా పిలుస్తా వుంటే ఆ మనసుల్లో వుండే కువ్వాదం చెన్నప్పకు తెలియకపాయ. యాటికి పోయినా అందరూ సల్లప్పను బాగ ఇదిగా చూస్తా వుంటే చెన్నప్పకు మనుసుకు శానా ఇదయిపాయ. ఒకపక్క సల్లప్పకు ఆ ఊళ్ళో వాళ్ళిస్తా వుండే మర్యాద చూసి సంబరమైతా వున్యా. ఒకపక్క అందోటికోగాని వానివానికే నిమ్మళ్ళం లేకుండా ఏడుపురాబట్టె. సరీకుల్ని చూస్తావుంటే ఎట్లా వోనికేగాని కడుపులో కుళ్ళు మోత్తనం లేకుండా వుంటుంద్యా.

రెడ్డోరి పసుల కొట్టంలోనే పెద్దరుగు మీద ఒగమూల చెన్నప్ప ఈత చాప పరుచుకుని కంబిడి కప్పకోని పండుకుంటాడు. సీకటితో లెయ్యల్ల. కొట్టమూడ్చి, పేడకసువెత్తేసి, ఆవుల్ని మందకు తోలి, పాలేటి వంకలో ఎద్దుల్ని కడక్కచ్చి, పచ్చగడ్డి పీక్కచ్చేకి పోవల్ల. తోటకాటికిపోయి మిషన్ బెట్టి చీనాచెట్లకు నీళ్ళు పారబెట్టల్ల. ఇంగా యేమో మడికాటికో, సేనుకాటికో పోయి రావల్ల. మల్లాయేమో బువ్వతినే దానికి వచ్చినబ్బుడు, ఇంగా మద్దెమద్దెలో రెడ్డి పెళ్ళామేమైనా పురమాయిస్తే ఆ పనులు గూడా చెయ్యల్ల. పోతావుంటే ఊళ్ళో అందురూ పెద్దోళ్ళేగాకుండా ఇంత పిల్ల వాయాళ్ళుకూడా 'లే! చెన్నుగా ఇక్కడ రావోయ్!" అని గదమాయించేవాళ్ళే. పెద్దిరెడ్డి "ఏరా!" అని పిలిస్తే ఈళ్ళుందరూ గూడా అట్లే పిలచల్లా. పెద్దిరెడ్డి అంటే అంటాడు. శానా మంచోడు పెద్దిరెడ్డి. అయ్యా, అమ్మా వదిలేసిన నా బొద్దు నుండీ జీతగానికింద చేర్చుకోని మూడు పూట్లా కుడుపునిండా ఇంత సంగిటి పెడతా

ఇంటి చాకిరితో సొంటి ముక్కలా అరిగి
పొలం పనిలో మంచు గడ్డై కరిగిపోతూ
అందరి ఆకలి తీర్చి
నా ఎర్రిబాగుల తల్లి
అవమానాలతోనే కడుపు నింపుకుంటుంది...
చిరిగిపోయిన అమ్మ రవికను చూసి
గుడ్ల గూబలన్నీ గుటకలు దిగమింగినపుడు
ఆకాశాన్ని చించి
అమ్మ వొంటినిండా కప్పాలనిపిస్తుంది...
అడ్డమైన పతోడికీ
నామీద కోపం వచ్చినపుడల్లా
అభం శుభం తెలియని అమ్మ
హఠాత్తుగా లంజవుతుంది
అనురాగానికి సముద్రమై
ఎట్టి చాకిరికి పుట్టినిల్లైన
అమ్మ చల్లని చూపులతోనే
నేలతల్లి ఊపిరి పీల్చుకుంటుంది...
కాళ్ళ కింద ముల్లు
కడుపులో కత్తి
కూడబలుక్కుని ఒకేసారి దిగబడినా
నా పిచ్చి తల్లి పెదాలమీద మాత్రం
పత్తి పువ్వులే పరిమళిస్తాయ్...

– కోయి కోటేశ్వరరావు




వుండాడు. ప్రెతి శివరాత్రికి పరసకు పొమ్మని దుడ్లిస్తాడు. ఉగాది పండక్కి పరమటీరన్నకు పన్యాసం బండి కట్టిన నా పొద్దయితే కొత్తంగీ, బనీను, సల్లాడమూ కుట్టిచ్చి, తువ్వాలు కొని స్తాడు. ఆయప్ప అంటే అంటాడు. ఏం తప్పా! పెట్టినోడు తిడితే ఏంబాయ. ఊర్లో మిగతా వాళ్ళందరికీ ఎంత కువ్వాడమో ఎబ్బుడన్నా రోంత బిడువు దొరికిన నా పొద్దు కూడా రాగి మానుకట్ట కింద కూకోని శూద్రోళ్ళ పిల్లో లతో గూడ పులి జీతమాడ కూడదంట. బ్రొండ్రాయి కాడ పిల్లోళ్ళతో చిల్లాకట్టె ఆడ కూడదంట. కమ్మోరి గేరిలో గోలీగుండ్లు ఆడకూడదంట. ప్రెతోడూ పైయాకం మనిషే. ఈళ్ళు పోతావుంటే వొంగోని వొంగోని నడస ల్లంట. ఎదురుగా వాళ్ళొస్తా వుంటే గోడవారకు పోయి నిలబడల్లంట. ప్రెతోడూ 'మాదిగ వా కొడకా! ఏం వోయ్! ఎంత వడ్దారమోయ్ నీకు చెన్నుగా!" అని అరిసేది. తిట్టేది, గదురుకునేది. ఇంగా జబర్దస్తీ చేసి ఆ పనీ ఈ పనీ పురమాయించేది. ఇయ్యప్పగార్లకు బీడీలు, సిగరెట్లు, అగ్గిపెట్టు తెచ్చియ్యల్లా. ఆ ఊళ్ళో జరుగుతా జరుగుతా వుండేదంతా అనుకోబట్టె చెన్నప్ప.

ఆ పొద్దంతా వుండే సల్లప్ప అనంతపురం ఎల్లి పోయినంక గూడా చెన్నప్పకు ఇంకా ఏంటేంటివో మనేదలు రాబట్టె.

మద్యాన్నం పూట బువ్వదిన్నెంక దిన్నమూ చెన్నప్ప ఎట్లైనా రోంత బిడువు జేసుకోని మంచి నీళ్ళెత్తకచ్చి రంగనాయకులు గుడికాడ బావలో పోస్తాడు. ఎండ పొద్దు పాపం దప్పికిగొన్నోళ్ళు తాగుతారని చెన్నప్ప నారాయణమ్మ నడిగి ఒక బాన ఇప్పిచ్చుకోనొచ్చి కింద ఇసకపోసి మంచినీళ్ళ బాన గుడికాడ పెట్టేండ నీళ్ళు పోసేదానికి. వచ్చినబ్బుడే చెన్నప్ప వాని కొట్టంవాకిలి తేసి ఈత పరక తీసుకోని కసువునూకి రోంచేపు ఆడ కూకోని గసతీర్చుకోని పోతాడు. ఆ నేలా, ఆ కొట్టమూ చెన్నప్పగాని తాత మరెప్ప వంట. వాళ్ళ తాత కట్టించిందే కొట్టం కాబట్టే అదంటే చెన్నప్పకు బొలేబ్రమ. రోంచేపైనా ఆ కొట్టంలో కూకుంటాడు చెన్నప్ప. ఎల్లిపోయేట బ్బుడు రంగనాయకులు గుడికి సుట్లు తిరిగి సామికి దండ పెట్టుకుంటాడు. సల్లప్పగాని తాత, చెన్నప్పగాని తాత, ఇంగా మాదిగ్గేరిలో వుండే పెద్దోళ్ళంతా కలిసి మాదిగ్గేరికి పోయే దావలో కట్టిచ్చిందేనంట ఆ రంగనాయకులు గుడి. ఆ రంగనాయకులు గుడి అరుగు మీద పెద్ద మర్రిమాను. మద్యాన్నం పూట పసలపిల్లోళ్ళంతా ఆడే పండుకుంటారు, ఆడుకుంటారు. ఆ పొద్దెందుకో సల్లప్పగాడు వచ్చిపోయినబ్బుణ్నుంచీ ఏందో మనసంతా బాగలేకుంటే గుడికాటికొచ్చి చెన్నప్ప అరుగు మీద కూకుండె. శానా మంది ఆ ఊళ్ళో వాళ్ళే దూడ పిల్లోళ్ళంతా రంగనాయకులు గుడి అరుగు మీద కూచ్చోని ఏందేందో మాట్లాడు కుంటా వుంటే చెన్నప్ప కూడా వాళ్ళ మాటలు ఇనబట్టె. వాళ్ళ ప్రయాణం సంగతులింటా వుంటే యాకులమోళ్ళయనా ఫరవాలేదా అని ఎవరో అడిగితే 'ఎవుడయితే నేం మనకు బస్సు నిండల్ల, లెక్క సరిపోవల్ల. ఎవుడు ముందు దుడ్లు ఇస్తే వాళ్ళ పేర్లు రాసుకుంటాం" అని వాళ్ళు మాట్లాడుకుంటా వుంటే చెన్నప్పకు సంబరమైపాయ. ఏమనుకున్నో యేమో వాడు ఉరికెత్తిపాయ.

పెద్దిరెడ్డి కుర్చీలో కూర్చోని సిగరెట్టు తాగుతా వుండే చెన్నప్ప వచ్చి రెడ్డి అంచన నిలబడె. ఎబ్బుడేగాని, చెన్నప్పగాడట్లొచ్చి అంచన నిలబ డడు. ఎబ్బుడైనా సినిమాకు దుడ్లు అడిగేటప్పుడే దగ్గరకొచ్చేది. రెడ్డినగె. 'ఏందిరా! సినిమాకేసి నావా ప్లను.' అనె. చెన్నుగాడు మలతాడు కుండే కొటం బీగం చెవి ఊడబీకి రెడ్డి కాళ్ళ ముందర బెట్ట. "నేను మా ఇంట్లోనే వుంటావుంటాను గద రెడ్డి! ఇంగ నాకేంటికి ఆ కొట్టం. మా కొట్టం ఇంగెవురికన్నా నీవే అమ్ముకో రెడ్డీ! వెయ్యి రూపాయిలిస్తే మాల ఏసుకుంటారెడ్డీ! రంగనాయకులు గుడికాడ మనూరోళ్ళు అనుకుంటా వుండారు. అయ్య ప్పస్వామి గుడికి పొయ్యే వాళ్ళంతా బస్సుకు ఐదునూర్లియ్యల్లంట. ఇంగా పూజలకు, భోజనాలకూ, ఒగో మనిషికింకా ఐదునూర్లన్నా కావల్లంట. నువ్వు 'ఊ' అంటే మాలేసుకం టారెడ్డి. నువ్వు దుడ్లిస్తానంటే మాలేసుకుంటా రెడ్డీ! నారాయణ అమ్మయ్యను గూడా అడి గానా రెడ్డి! నీవు ఒప్పుకుంటే మాలేసుకుంటా రెడ్డి!" అని బంగపాయ చెన్నప్ప.

రెడ్డి పైకిలేచి బీగం చెవి తీసుకోని లోని లోపలికి బోయి వచ్చె. "రేపు ధర్మారం రావల్ల రా నీవు. ఆడ ఆఫీసులో కాయితాల మీద నీవు సంతకాలు పెట్టల్ల ఇదిగో పట్టు"అని అంటా అంటానే రెడ్డి లెక్క చేతులో పెట్టె. నూరు రూపాయిల కాయితాలు చూస్తా వుంటే

## అటు తిరిగి

ఎవరు నా కన్నీళ్ళ దగ్గరకొచ్చి ఏడుస్తోంది
ఎవరు నాతో ఒంటరి కలల్తో వస్తోంది

నన్ను కుట్టనందుకు
పాముని వెంబడిస్తుంటే
అది పారిపోతూ నా నుంచి తప్పిపోతూ
పక్షై ఎగిరింది

అడ్డదిడ్డంగా రాత్రులు. నడిచిపోతున్నాయి


పాడైన వాక్యంలోని
ఫుల్‌స్టాప్‌ని బాగుచేస్తున్నాను

నన్ను చూస్తున్నట్టు
చూస్తున్నాను నా ముఖం వంక

కనిపించని నిశ్శబ్దంలోకి
నన్నెవరు లాక్కుంటున్నారు

ఎవరు తీసుకున్నారు నా మృత్యువుని
ఎవరు తప్పిపోయారు నా సమాధిలోపల

— ఎం.ఎస్. నాయుడు



చెన్నప్పకు పెదింత సంబరమైపాయ. దుడ్లు ఎంచుకోనుగూడాలే. పరిగెత్తుకుంటాపాయ. యాత్రుకు పోయే దానికంతా పెద్ద బలిజోళ్ళ పిల్లోడు అపరాదే పెద్ద. అందరికంటే ముందు గల్గా చెన్నప్ప అపరాదికి వెయ్యి రూపాయిలిచ్చి పేరెక్కిచ్చమనె.

చెన్నప్ప అయ్యప్పసామి మాలేసుకుండె. నారాయణమ్మతో సబ్బు, సీకాయి ఇప్పిచ్చకపోయి పాలేటాంకలో బాగ స్నానం చేసి యాత్రకు పోయే వాళ్ళందరికీ కుట్టిచ్చిండే నల్ల గుడ్డలు ఏసుకోని గంధం బెట్టుకొని, కుంకం బెట్టుకొని. మెళ్ళో పూలదండ ఏసుకోని నడుస్తా వుంటే చెన్నప్ప బొలే బాగుండె నాయాలు!

పెద్దిరెడ్డి, నారాయణమ్మ, బాపనోళ్ళు, కరణాలు, కోమిటోళ్ళు రెడ్డోళ్ళు, కమ్మోళ్ళు, బలిజోళ్ళు, బాయేళ్ళు అందరూ ఊళ్ళోవాళ్ళు పిల్లోళ్ళు, పెద్దోళ్ళు అందరూ చెన్నప్పగాణ్ణి 'సామీ! ' 'సామీ!' అనబట్రి. ఎవుడేగాని ఇబ్బుడు చెన్నప్పను 'చెన్నుగా!' అని గానీ, 'ఏంపోయ్ కొవ్వా!' అనిగాని, ' నా కొడకా!' అని గానీ, 'ఏ !' లే. నోట్లోకి ఎంగిలి మూస్తా!' అనిగాని అనలే. అందరూ 'సామీ!' 'సామీ!' అనబట్రి. మాలేసుకోని పదాలు పాడుకుంటా, భజన చేసుకుంటా వస్తా వుంటే ఆడోళ్ళంతా కాళ్ళ ముందు నిండు కడవలు గుమ్మరిచ్చిరి. ఆ నలభై రోజులు అందరూ సామీ! సామీ! అనబట్రి. కుర్చీల్లోకూచోమని. దండేసిరి. కాళ్ళకు దండం బెట్టుకుండ్రి. ఏం.లే ఇంగ ఆ నలభై రోజులూ అయ్యప్ప సాములందరికీ రంగనాయకులు గుడికాడే అరిటాకుల్లో బాపనోళ్ళ భోజనాలు. 'లెక్కపోతే పాయనీయక్క!' అనుకోని సంబరపడిపాయ చెన్నప్ప. పుట్టిన నా పొద్దు నుంచీ యా పొద్దేగాని చెన్నప్పగాడు ఇట్లా తిండి తినిండ్లా. యా పొద్దేగాని ఎవుడేగాని చెన్నుగాణ్ణి ఇంత బహుమానంగా మాట్లాడిచ్చిండ్లా. ఇంగ శబరిమై పోయ్యే నా పొద్దు బస్సెక్కుతా వుండే 'సామీ! సామీ!' అని అందరూ చేతులెత్తి మొక్కబట్రి.

చెన్నప్ప శబరిమలైకిపాయ. దర్శనం జేసుకునె. దీక్షముగించ. తిరపతికిపోయి గుండు కొట్టించ. కొండ మీద ఎంకటేశ్వరస్వామి గుడికాడ చెన్నప్పను ఎవుడేగాని అడ్డపెట్లా. చెన్నప్పకు ఆశ్చర్యమైపాయ.

చెన్నప్ప వాళ్ళూర్లో మాదిగ్గేరి కాడుండే రంగనాయకులు గుడి తప్ప ఇంకేందో చూసిండ్లా. నరసింహస్వామిగుడి, ఆంజనేయస్వామి గుడి రాములోరి గుడి, కట్టకింద ఈశ్వరుని గుడి – ఆ వూళ్ళో ఇన్ని గుళ్ళున్నా యా పొద్దేగాని చెన్నప్ప ఒక గుడికీ పోయిండ్లా. మాదిగోళ్ళను ఆ గుళ్ళ కాటికి రానీరని చెన్నప్పకు తెల్సు. పిల్లబ్బుడు సల్లప్పగాడు ఆంజనేయస్వామి గుళ్ళోకి దూరింటే నారప్పరెడ్డి చింత బర్లుపీక్కోని పైబగల గొట్టిండ. మళ్ళీ పెద్ద సాముల్ని దోలకచ్చి పుణ్యావాచనం చేయించిరంట. అందుకే ఆ పొద్దు నుంచీ ఏమాదిగోడూ ఆ గుళ్ళకల్లబోడు.

తిరపతి కొండ మీద ఎంకటేశ్వరస్వామిని చూసేకి పోతా వుంటే చెన్నుగాణ్ణి ఎవురేగాని అడ్డుకోలే. జనంలో బడి సక్కగ గుళ్ళోపలికి పోతావున్నాసరే ఎవురేగాని అడ్డపడలే. చెన్నప్ప ఎంకటేశ్వరస్వామికి ఎదురంగ నిలబడుకోని లచ్చనంగా మూశ. వరెవరెవరె.. పాసుగోల, ఏముండాడురా భగవంతుడు! అని అనుకోని చెన్నప్ప సంబరంగా ఇగిలించ. ఆడుండే పూజారి సామి చెన్నప్పకు నెత్తి మీద అదేందో పెట్టి తీర్థం పోసె. చెన్నప్పకు ఆనందంతో కడుపునిండి పాయ.

తిరపతి గుళ్ళో నుంచీ బైటికి వస్తాన్నంగనే చెన్నప్పకు దిగులు పట్టుకండె. ఇగ ఇబ్బుడు మళ్ళా ఊరికిపోతే!! ఇంకెవ్వుడూ 'సామీ! సామీ!' అనడు. మళ్ళీ ఇంగంతా మామూలే. చెన్నప్పకు ఏమైనా సరే ఇంక మళ్ళా వాళ్ళూరికి పోబుద్ధికాలే. బస్సోళ్ళను ఎల్లిపోమనె. వాళ్ళూరు పిల్లోళ్ళతో 'నేను ఇంగ రాను. మీరు పోండి' అనె.

దిగవ తిరపతిలో ఏందో పెద్ద ఫ్యాక్టరీలో శానా పెద్ద పెద్ద టైర్లు ఎత్తే బరువు పనులుంటే చెన్నప్ప ఆటికి పోయి ఆ ఉద్యోగంలో కుదురుకుండె. ఆడ ఎవుడేగాని చెన్నప్ప కులం గురించి పట్టించుకోలే. ఎవుడేగాని యా పొద్దేగాని చెన్నప్పను మీరు ఎమిటోళ్ళని అడగలే. ●